క్లుప్తంగా

5న మహిళా దినోత్సవం

సామర్లకోట: ఈ నెల 8వ తేదీన మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మదర్ థెరిసా వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆ సంస్థ అధినేత జి.రాజు మాట్లాడుతూ వివిధ శాఖలో పని చేస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్, ఎస్సై, హెచ్ఎం, సీడీపీఓ, డాక్టర్లను సత్కరిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు మహిళా దినోత్సవ ప్రాధాన్యంపై వక్తృత్వ, ముగ్గుల పోటీలు, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్టు ఆయన తెలిపారు.

స్వర్ణ, రజత పుష్పాలతో మరిడమ్మకు పూజలు



పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం స్వర్ణ, రజత పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు చేయగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం



కొండెవరంలో నిర్వహిస్తున్న వేంకటేశ్వర కల్యాణం

కొత్తపల్లి: కొండెవరంలోని పద్మావతీ సమేత వేంకటేశ్వర స్వామి దివ్య కల్యాణాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

నేడు రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు

కల్యాణ మహోత్సవాల సందర్భంగా రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహించనున్నారు. శనివారం వింజనంపాడుకు చెందిన స్నేహ ఆర్ట్స్ బృందం కొండంత అండ, శృంగార వల్లభ ఆర్ట్స్ బృందం కబ్జా నాటికలు ప్రదర్శించనున్నారు.

ఘనంగా జగన్నాథుడు, సత్యదేవులకు..



జగన్నాథుడు, సత్యదేవుని కల్యాణాలు నిర్వహిస్తున్న అర్చకులు

కొత్తపల్లి: స్థానిక బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి, సత్యనారాయణ స్వామి వార్ల కల్యాణం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం జగన్నాథస్వామి వారు, సత్యనారాయణ స్వామి వార్ల కల్యాణ మహోత్సవాల్లో ప్రత్యేక పూజల అనంతరం గరుడ, గజ వాహనాలపై గ్రామోత్సవం నిర్వహించారు. వేదమంత్రాలతో కల్యాణం నిర్వహించారు. భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు, శనివారం స్వామికి ప్రత్యేక పూజలు, హోమాలు, సహస్ర నామార్చన, శ్రీ, భూ సమేత వెంకటేశ్వరస్వామికి ఊంజల్ సేవ నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో సోమేశ్వరుని రథయాత్ర



వేట్లపాలెంలో సాగుతున్న స్వామివారి రథయాత్ర

సామర్లకోట: వేట్లపాలెంలోని రాజరాజేశ్వరీ సమేత సోమేశ్వర స్వామి రథయాత్ర శుక్రవారం ఘనంగా సాగింది. స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గ్రామోత్సవం జరిగింది. మాజీ ఎంపీపీ కొండపల్లి కృష్ణమూర్తి, గ్రామ ఉపసర్పంచ్ గోలి శ్రీరామ్, మాజీ ఉపసర్పంచ్ గోలి వెంకట్రావు, ఉత్సవ కమిటీ నాయకులు పుట్టా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా స్వామివారి కల్యాణం

వేట్లపాలెంలోని రాజరాజేశ్వరీ సమేత సోమేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం రాత్రి నేత్ర పర్వంగా జరిగింది. రథయాత్ర అనంతరం ఆలయానికి చేరిన ఉత్సవ విగ్రహాలను వేదికపై ఉంచి కల్యాణం జరిపించారు. ఉత్సవ కమిటీ నాయకులు భక్తులకు సేవలందించారు.

గేటు పడితే గంటే..!

- నిరీక్షణకు గ్రామస్తులు సతమతం
- గ్రామం అంతా ఆవైపు.. పనులన్నీ ఈవైపు..
- రైల్వే కాను నుంచి మార్గం కల్పిస్తే ఊరట

సామర్లకోట: మండల పరిధిలో కెనాల్ రోడ్డులో ఉన్న మేజరు పంచాయతీ గ్రామం అంతా రైల్వే గేటు ఆవలి వైపు ఉంది. దాంతో రైల్వే గేటు వేస్తే ఆ గ్రామ ప్రజలు ఇబ్బందులకు గురి అవుతు న్నారు. సుమారు 10 వేలు జనాభా ఉన్న గ్రామ ప్రజలు నిత్య అవసరాల కోసం సామర్లకోట, కాకినాడ ప్రాంతాలకు వెళ్తుంటారు. ఇటీవల కాలంలో రైళ్ల సంఖ్య పెరగడంతో పీబీ దేవం రైల్వే గేటు వేస్తే సుమారు గంట వరకు తెరచుకోవు.

రైల్వే కాను నుంచి అనుమతించాలి..

రైల్వే గేటు సమీపంలో పట్టాల దిగువ భాగం నుంచి కాను ఏర్పాటు చేశారు. వరదలు వచ్చే సమయంలో నీరు బయటకు వెళ్లేందుకు దానిని ఏర్పాటు చేశారు. ఈ కానుకు ఇరువైపులా రైల్వే భూములు ఉన్నాయి. ఈ కాను గుండా రాక పోకలకు అనుమతిస్తే చిన్న వాహనాల రాకపోకలకు అవకాశం ఉంటుంది. శుక్రవారం గ్రామంలో పర్యటించిన ఎంపీ వంగా గీతకు గ్రామస్తులు ఈ సమస్య వివరించారు.

గేటు అవతలే గ్రామం..



గ్రామం అంతా రైల్వే గేటు ఆవలివైపే ఉంది. దీంతో రైలు పట్టాలు ఉన్న ప్రాంతాల్లో కమ్మీలతో ఆ ప్రాంతాలు మూసేయాలని ఆ శాఖ నిర్ణయించింది. దాంతో గ్రామంలోని రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాంలను కలుపుతూ కాలిబాట వంతెన నిర్మించాలని, రైల్వే కాను మీదుగా వాహన రాకపోకలకు అనుమతించాలని ఎంపీని స్థానికులు జరిగింది. ప్రజల సహకారంతో కాను నుంచి రోడ్డు నిర్మాణం చేసుకొంటాం.

– మలకల సూరిబాబు, ఎంపీటీసీ, రైల్వే బోర్డు సలహా మండలి మాజీ సభ్యుడు, పీబీ దేవం



పీబీ దేవం గ్రామ ప్రజల సమస్య తీర్చు రైల్వే కాను

కాను నుంచి వెళ్లేందుకు అనుమతి కోరతాం..



రైల్వే గేటు ఆవలి వైపు ఉన్న పీబీ దేవంలో కాను మీదుగా రాక పోకలు జరిగేలా రైల్వే అధికారుల నుంచి అనుమతి తీసుకుంటాం. గ్రామస్తులు వారి సమస్యను వివరించారు. ఇప్పటికే జి.మేడపాడులో కాను నుంచి రాక పోకలకు అనుమతి లభించింది. పనులు ప్రారంభించాలని గ్రామస్తులకు సూచించా. రైల్వే స్టేషన్‌లో కాలిబాట వంతెనకు నిధులు ఇప్పట్లో సాధ్యం కాదు.

– వంగా గీతా, ఎంపీ, కాకినాడ

నాడు–నేడు నిధులు సరిగా ఖర్చు చేయండి



సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిబ్బంది తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్

- ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాశ్
- ప్రభుత్వ జూనియర్ కళాశాల, హాస్టల్ తనిఖీ
- సిబ్బంది పనితీరుపై ఆగ్రహం

సామర్లకోట: విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శుక్రవారం సాయంత్రం అధికారులను పరుగులు పట్టించారు. పెద్దాపురం మండలం చంద్రమాంపల్లిలో తనిఖీల అనంతరం ఆయన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు–నేడు పనులను తనిఖీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.కోటి 10 లక్షలు మంజూరైతే కేవలం రూ.నాలుగు లక్షలు మాత్రమే ఖర్చు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో యూరినల్స్ లేకుండా మరుగుదొడ్లు మాత్రమే నిర్మించడం సరికాదని, బాలికలు, బాలురకు యూరినల్స్ ఏర్పాటు చేయాలన్నారు. నిర్మాణ సామగ్రిని సకాలంలో అందజేయకపోవడంపై విద్యాశాఖ ఇంజినీరింగ్ అధికారులు వెంకటేశ్వరరావు, నటరాజ్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామమూర్తి పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నాడు–నేడు పనులను తరుచూ పరిశీలించాలని ఆర్‌జెడీ నాగమణిని ఆదేశించారు. సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ గురించి అడిగితే గిరిజన సంక్షేమ హాస్టల్‌కు తీసుకువెళ్లిన అధికారులపై అసంతృప్తి వ్యక్తంచ చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ బీసీ బాలిక హాస్టల్‌ను గుర్తించి తనిఖీ చేసి 20 మంది మాత్రమే ఉండడంపై నిర్వహణ సరిగా లేదని అన్నారు. పాఠ్య పుస్తకాలు హాస్టల్‌లో కాకుండా పాఠశాలలో ఉన్నాయని చెప్పడంపై వార్డెన్ జయసుందరి పనితీరును తప్పు పట్టారు. బాలికలకు ఇచ్చి ట్యాబ్‌లను ఆయన పరిశీలించారు. బాలికల విద్యపై పరిశీలన ఉండాలని ఆర్‌జేడీని ఆదేశించారు. డీఈఓలు అబ్రహం, కె.అన్నపూర్ణ, డీవైఈఓలు ఆర్‌జెడీ రాజు, సుభద్ర, ఎంఈఓ వై.శివ రామకృష్ణయ్య, హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఈడీ లైట్లకు టైమర్లు ఏర్పాటుచేయాలి

పంచాయతీ అధికారులకు డీపీఓ ఆదేశం

సాక్షి ఇంపాక్ట్

సామర్లకోట: ఎల్ఈడీ లైట్లకు టైమర్ బ్యాక్సులు ఏర్పాటు చేయాలని జెడ్పీ సీఈఓ ఎస్.సత్యనారాయణ అన్నారు. 'పగటి వెలుగులు ఎవరి కోసమో?' అనే శీర్షికతో గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. మండల పరిధిలో నిత్యం వెలుగుతున్న లైట్లను పంచాయతీ కార్యదర్శితో కలసి మోటారు సైకిలుపై పర్యటించి పరిశీలించారు. గొంచాల గ్రామంలో వెలుగుతున్న లైట్లను ఆర్పేలా చర్యలు తీసుకున్నారు. మిగిలిన గ్రామాల్లో వెలుగుతున్న లైట్లపై శ్రద్ధ చూపాలని ఈఓ పీఆర్డీ హిమామహేశ్వరి, ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. ఉండూరులో ఎల్ఈడీల కోసం టైమర్లు ఏర్పాటు చేశామని కార్యదర్శి కుమార్‌రాజా ఆయనకు వివరించారు. మండల పరిధిలోని 18 గ్రామాల్లో ఎల్ఈటీ లైట్లు రాత్రి సమయంలో మాత్రమే వెలిగేలా రెండు రోజుల్లో చర్యలు తీసుకుంటామని సీఈఓ పేర్కొన్నారు.



గొంచాల గ్రామంలో వెలుగుతున్న ఎల్ఈడీ లైట్‌ను పరిశీలిస్తున్న డీపీఓ సత్యనారాయణ

వేసవిలో నీటి ఎద్దడి రానీయొద్దు



కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పెద్దాపురం/సామర్లకోట: రానున్న వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని పంచాయతీల కార్యదర్శులకు ఎంపీడీఓ కరక హిమమహేశ్వరి ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని 23 గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో నీటి వనరులపై కార్యచరణ ప్రణాళికపై సమీక్షించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీల్లో నీటి వనరులపై, పారిశుద్ధ్యం నిర్వహణ, ఇంటిపన్నుల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్ ప్రక్రియ, సచివాలయ సేవలు, స్పందన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలన్నారు. ఈఓ పీఆర్డీ మూర్తి, జ్యోతుల పద్మరాజు, పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమాచారం ఇస్తే ట్యాంకర్లతో నీరు..

సామర్లకోటలో హిమమహేశ్వరి మాట్లాడుతూ నీటి ఎద్దడిని ముందుగానే గమనించి సమాచారం ఇస్తే ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో చర్చించి ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించే విధంగా చేస్తామని తెలిపారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

ఎంపీ గీత, హౌసింగ్ చైర్మన్ దొరబాబు



ఆలయ పూజల్లో పాల్గొన్న ఎంపీ గీత, దొరబాబు

పెద్దాపురం: ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన ఎంతో అవసరమని ఎంపీ వంగా గీత, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని సిరివాడలో శుక్రవారం రామాలయం విగ్రహ పునఃప్రతిష్ఠకు వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యవసాయ సలహా మండలి సభ్యుడు యినకొండ వీర విష్ణుచక్రం అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ సభలో వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. శ్రీరాముడి దయతో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలన్నారు. అనంతరం ఆలయ పునఃప్రతిష్ఠలో ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, పులిమేరు సొసైటీ అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి, మద్దూరి వెంకటేశ్వరరావు, చంటిబాబు, భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో ఎంపీ పూజలు

సామర్లకోట: మండల పరిధిలో పీబీ దేవంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని పురస్కరించుకుని ఎంపీ వంగా గీత, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు మలకల వరహాల బాబు, గ్రామ సర్పంచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. వేట్లపాలెంలోని సోమేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలలోను వారు పాల్గొన్నారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి వీరభద్రం పాల్గొన్నారు.

బాలికలకు ఆత్మస్థైర్యం అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ ఉష

సామర్లకోట: బాలికలు ఆత్మస్థైర్యం పెంచుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఉష పిలుపు నిచ్చారు. బేటీ బచావో బేటీ పఢావోలో శుక్రవారం ఆమె స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో బాలల హక్కులు, బాలికల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పాఠశాల హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ అధ్యక్షత వహించగా అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టరు శ్రీలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చంద్రకళ, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మల్లెతోటలో సస్యరక్షణపై అవగాహన



పనసపాడు గ్రామంలో మల్లె తోటలను పరిశీలించిన ఉద్యానవన శాఖ అధికారులు

సామర్లకోట: మండల పరిధి పనసపాడు గ్రామంలోని మల్లెతోటను ఉద్యాన శాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. డాక్టర్ వైఎస్సార్ తోట బడి నిర్వహించి ఉద్యాన అధికారి ఎస్.సుజాత మల్లెతోట సమగ్ర సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ సహాయకుడు ఎంవీవీ రమణ, రైతులు పడాల రాము, బుచ్చిబాబు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-మార్ట్ ప్రతిష్ఠాత్మకం



వీఓఏను సత్కరిస్తున్న పీడీ రమణి

కొత్తపల్లి: ఉప్పాడలో తొలిసారిగా ప్రారంభించిన చేయూత మహిళా మార్టు రాష్ట్రంలోనే ప్రతిష్ఠాత్మకంగా నిలిచిందని, ఇందులో వీఓఏల కృషి అభినందనీయమని డీఆర్‌డీఏ పీడీ రమణి అన్నారు. మార్టును శుక్రవారం ఆమె సందర్శించి మహిళా సమాఖ్య కార్యాలయంలో వీఓఏలతో సమావేశమయ్యారు. వీఓఏలను శాలువా మెమెంటోలను ఇచ్చి సత్కరించారు. ఈ మార్టు తొలిసారిగా రూ.కోటి విలువైన విక్రయాలు చేసిందన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కొత్తపల్లి: అంగన్‌వాడీ సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించాలని సీడీపీఓ దుర్గాదేవి అన్నారు. మండలంలోని పాత ఇసుకపల్లి ఉప్పరగూడెంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె శుక్రవారం తనిఖీ చేసి రికార్డులు, పౌష్టికాహారాన్ని పరిశీలించారు. చిన్నారులకు, గర్భిణులకు మెరుగైన పౌష్టికాహారాన్ని అందించాలని ఆమె సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణపై ఫిర్యాదులు వస్తున్నాయని ఆమె అన్నారు.

కొండెవరంలో ఏకాహం

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం రామాలయం వద్ద శుక్రవారం శ్రీరామ రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో ఏకాహం నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భజన సమాజ బృందాలు పాల్గొన్నాయి. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రతిష్టాత్మకంగా 'మీ భూమి–మా హామీ'

- రీ సర్వే సమగ్రంగా చేపట్టాలి
- ఆర్డీఓ రామారావు



వడ్లమూరులో అధికారులతో పర్యటిస్తున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: రాష్ట్ర వ్యాప్తంగా వందేళ్ల తరువాత గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వ్యవసాయ, గ్రామకంఠం స్థిరాస్తుల సర్వే కోసం సీఎం జగన్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా 'మీ భూమి–మా హామీ' పేరిట భూ రీసర్వే చేపట్టారని ఆర్డీఓ జిక్కుల సీతారామారావు అన్నారు. మీ భూమి మా హామీ పథకంలో భాగంగా మండలంలోని వడ్లమూరులో శుక్రవారం భూ రీ సర్వేను పరిశీలించారు. డివిజన్ వ్యాప్తంగా ఒక్కో గ్రామానికి పైలట్ ప్రాజెక్టుగా రీ సర్వే చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సమగ్రంగా విజయవంతం చేయాలని ఆర్డీఓ సూచించారు. అనంతరం రైతుల పొలాల్లో వేసిన సరిహద్దు రాళ్లను, జగనన్న కాలనీ లే అవుట్‌లోని ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. తహసీల్దార్ వజ్రపు జితేంద్ర, హౌసింగ్ ఏఈ సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీరరాఘవరావు, సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

దోచుకున్నదెవరో ప్రజలే చెబుతారు!

మాజీ ఎమ్మెల్యే వర్మపై కౌన్సిలర్ల మండిపాటు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

పిఠాపురం: అందినంత దోచుకుని కొందరి అధికారుల చావుకు కారణమై తిరిగి తామే దోచుకున్నామంటున్నారా అని మున్సిపల్ చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి, వైస్ చైర్మన్లు పచ్చిమళ్ల జ్యోతి, కొత్తపల్లి పద్మ, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు గండేపల్లి బాబీ తలిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు మాజీ ఎమ్మెల్యే వర్మపై మండిపడ్డారు. పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రజాధనం దుర్వినియోగంపై అధికారులను నిలదీస్తే మేము అవినీతి పరులమంటున్నారు మరి మాట్లాడకుండా కూర్చున్న మీ కౌన్సిలర్లను ఏమనాలని వారిని ప్రశ్నించారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు ప్రజాధనం దుర్వినియోగంపై ఎవరినీ వదిలిపెట్టవద్దని తమకు స్వేచ్ఛ ఇచ్చారన్నారు. పాత ఇనుము సామాన్ల వేలంలో అక్రమాలు జరిగాయి కాబట్టే తాము అధికారులను నిలదీశామన్నారు. రూ 11 లక్షల అవినీతి కుంభకోణం చేసిన అధికారుల వెనుక టీడీపీ కౌన్సిలర్లు, మాజీ ఎమ్మెల్యే వర్మ ఉన్నారు కాబట్టే అవినీతి అధికారులను వెనుకేసుకువస్తున్నారని ఆరోపించారు. ఎవరి హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో ప్రజా క్షేత్రంలో తేల్చుకోడానికి ప్రత్యక్ష చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని వారు సవాల్ విసిరారు.

వీధికుక్కలు, పందుల నియంత్రణకు చర్యలు

కరప: గ్రామాల్లో వీధి కుక్కలు, పందుల నివారణకు మండల, గ్రామ పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేసి, తగిన చర్యలు తీసుకుంటామని మండల ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, పశుసంవర్ధకశాఖ వైద్యాధికారులు, సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్లతో ఈఓ పీఆర్డీ సమావేశమయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సమస్యపై చర్చించారు. పెంపుడు కుక్కలు ఉన్న వాళ్లు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలన్నారు. పందుల పెంపకందార్లతో మాట్లాడి, గ్రామానికి దూరంగా పెంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సొంత కుక్కలకు ఏఆర్వీ ఇంజక్షన్లు చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం.రవికిరణ్‌బాబు మాట్లాడుతూ చట్ట ప్రకారం పందులు, కుక్కల హక్కులకు భంగం వాటిల్లకుండా వాటి నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, దానికి గ్రామ పంచాయతీలే బాధ్యత వహించాలన్నారు. మెదడువ్యాపు వ్యాధి రాకుండా సకాలంలో ఇంజక్షన్లు చేయించాలన్నారు. వీధి కుక్కలు కరవడం వల్ల రేబిస్ వస్తుందని, పిచ్చికుక్కల అయితే ప్రమాదకరమన్నారు. వీధికుక్కల వ్యాప్తిని అరికట్టేందుకు జంతు సంక్షేమ సంఘ ప్రతినిధులు, పర్యవేక్షణ కమిటీల పర్యవేక్షణలో నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు సంతాన నిరోధక ఆపరేషన్లు చేయించాలన్నారు. ఏఓ గుత్తుల భీమశంకరరావు, వేళంగి, అరట్లకట్ట పశువైద్యాధికారులు డాక్టర్ అనిల్ విల్సన్, డాక్టర్ బి.తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలి



గ్యాస్ బండలతో నిరసన తెలియజేస్తున్న రైతు కూలీలు

పెద్దాపురం: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా పట్టణ పరిధిలో ఒకటో వార్డు పులిమేరు శివారు దమ్ముపేటలో శుక్రవారం రైతు కూలీలు ధర్నా చేశారు. రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజుబాబు, మడికి సత్యం, దేశెట్టి సురేష్ మాట్లాడుతూ కేంద్రంలో మోడి, అమిత్‌షా నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం రోజురోజుకు గ్యాస్ ధరలు పెంచుతోందన్నారు. కార్యక్రమంలో వీరబాబు, శివాజీ, మునిలిబాబు, నారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

కాకినాడ: నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ పీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. శుక్రవారం ఆయన ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్‌తో కలిసి శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లతో సమీక్షించారు. పారిశుధ్యాన్ని పూర్తిగా గాడిలో పెట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆదివారం కూడా చెత్త సేకరణకు తీసుకోవలసిన చర్యలపై సూచించారు. వారం రోజుల్లో ఇవన్నీ అమల్లోకి వచ్చేలా చూడాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శానిటరీ సూపర్‌వైజర్లు జిలానీ, రాంబాబు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.